క్లుప్తంగా

కరెంటు తీగలు మార్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



చినగంజాం: విద్యుత్ తీగలు తెగిపడతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'అమ్మో కరెంటు తీగలు' అనేకథనానికి అధికారులు స్పందించి పాడైపోయిన కరెంటు తీగలు, కాసారాలను మార్చివేశారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో కాలం చెల్లిన కరెంటు తీగలతో ప్రజలు అవస్థలు పడుతున్నారనే విషయమై ప్రజల అభిప్రాయాల మేరకు వార్త పబ్లిష్ కాగా, విద్యుత్‌శాఖ ఏఈ గణనారాయణ వెంటనే స్పందించి దెబ్బతిన్న కరంటు స్తంభంపై ఉన్న కాసారం, తీగలను మార్చి వేసి సమస్యను తొలగించారు. అటు తరువాత గ్రామ పంచాయతీలో సమస్యగా ఉన్న కరెంటు తీగలను ప్రజలు తన వద్దకు సమస్యను తీసుకొని వస్తే వెంటనే మార్చి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖాధికారుల చర్యలు పట్ల గ్రామస్తులు సాక్షికి ధన్యవాదాలు తెలియజేశారు.

చీరాల ఏపీఎం బదిలీ

చీరాల టౌన్: ఐకేపీ మండల ఏపీఎం గద్దె సుబ్బారావు చినగంజాం ఏపీఎంగా బదిలీ అయ్యారు. శనివారం ఈ మేరకు బదిలీల ఉత్తర్వులు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఏపీఎంకు అందాయి. చీరాలకు నూతన ఏపీఎంగా కారంచేడు ఏపీఎంగా పనిచేస్తున్న మధును నియమించారు. నూతన ఏపీఎంగా మధు బాధ్యతలు స్వీకరించారు.

యాచకుడు మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు మృతి చెందాడు. అందిన వివరాల మేరకు.. జాతీయ రహదారిపై ఇసుక దర్శి, కోనంకి గ్రామాల మధ్యగల పాండురంగ స్వామి ఆలయం ఎదురు రోడ్డుపై వెళ్తున్న యాచకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో యాచకుడు అక్కడికక్కడే చనిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వామి.. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు



శింగరకొండ దేవస్థానంలో ఆశీర్వాదం తీసుకుంటున్న హనిమిరెడ్డి



చీరాల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



పర్చూరు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన నాయకులు
- తిరుమల లడ్డూ రాజకీయం చేయడం సిగ్గుచేటు
- కూటమి ప్రభుత్వాన్ని చీదరించుకుంటున్న ప్రజలు
- పూజలు చేసిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. చంద్రబాబు తిరుమల శ్రీవారి ప్రసాదం విశిష్టతను మంటగలిపి చేసిన పాపాలకు ప్రక్షాళన కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనకన్నా జగనన్నపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నారు. జగన్ మోహన్‌రెడ్డిపై పెట్టిన సమయంలో కొంత సమయం అయిన పాలనపై దృష్టిపెడితే మంచి పాలన అందించవచ్చన్నారు. తన 100 రోజుల పాలనలో ప్రజలకు ఏమి చేయలేదన్నారు. పాలన గురించి ప్రజలు మాట్లాడకుండా తిరుమల లడ్డూ ప్రసాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. పవన్‌కల్యాణ్ మరో అడుగు ముందుకు వేసి వివాదస్పద వ్యాఖ్యలు చేసి ప్రజల మధ్య కులమతాల చిచ్చు పెడుతున్నారన్నారు. దేవుడిని రాజకీయాలకు వాడుతున్నారన్నారు. ఎన్నోసార్లు తిరుమల వెళ్లిన జగన్ మోహన్‌రెడ్డిని డిక్లరేషన్ అడగటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలో జగన్‌కు ఉన్న ఆదరణ చేసి కూటమి ప్రభుత్వం ఇలాంటి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. రాబోయో రోజుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు దేవస్థానాలకు వస్తే పూజలు చేశారని పూజారులపై కూడా కేసు పెడతారేమోన్నారు. ఇలాంటి అనవసర కక్ష సాధింపు చర్యలు మానుకుని, ఇచ్చిన హామీలు నెరవేర్చి మంచిపాలన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, గ్రామాల సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్‌లు, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలలో పూజలు చేసిన పర్చూరు నాయకులు

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని పర్చూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు శనివారం తిరుమల వెంకటేశ్వరుని సందర్శించి పూజలు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వారు తిరుమలను సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, ఎం హేమంత కుమార్ రెడ్డి, రాయపాటి జాషువా తదితరులు ఉన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే లడ్డూ వ్యవహారం..

100 రోజుల కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ నాయకులు మండి పడ్డారు. ప్రైవేటు పరం కాబోతున్న వైజాగ్ స్టీల్ ప్లాంటును ఆపలేక, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కూటమి ప్రభుత్వం లడ్డూ వ్యవహారాన్ని తెరమీదికి తెచ్చిందని వారు తీవ్రంగా విమర్శించారు. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పర్చూరు వేణుగోపాల స్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కఠారి అప్పారావు మాట్లాడుతూ 100 రోజుల కూటమి ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. తిరుమల ప్రతిష్టకు భంగం కలగించిన వారిని వెంటనే శిక్షించాలని ఆయన దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రావువారి వెంకట శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు లంకశివ, గాజుల రమేష్,కోట శ్రీనివాసరావు, ముప్పాళ్ల రాఘవయ్య, గోగుల పూర్ణ, ఒగ్గిశెట్టి ప్రసాద్, జెట్టి చంద్రం, కంచనపల్లి రమేష్, మల్లా శ్రీను, తులసి నాగమణి,ఒట్టెం విజయ్, తులసి శివనాగేశ్వరరావు, షేక్ బాజీ, శేషగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, తేళ్ల చింపిరమ్మ, ముతకన రాజేష్, జాగర్లమూడి ఆంజనేయులు, పోతిన వాసు, స్వర్ణ శ్రీనివాసరావు, నూర్‌బాషా మీరయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జాగర్లమూడి సందీప్, పోపూరి సదాశివరావు, జాష్టి ఆంజనేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వరస్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటిని మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యులు కట్టాబాబు, నాయకులు పాల్గొన్నారు.



కారంచేడు వెంకటేశ్వరస్వామి గుడిలో వైస్ ఎంపీపీ సుబ్బారావు ప్రత్యేక పూజలు



తిరుమలలో శ్రీవారిని దర్శించుకొన్న పర్చూరు నియోజకవర్గ నాయకులు

చంద్రబాబు కుల రాజకీయాలు మానుకోవాలి..

చీరాల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వక్రబుద్ధిని తొలగించి మంచి బుద్ధిని ప్రసాదించి క్షమించాలని పూజలు నిర్వహించారు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 20 వార్డులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రబాబు కుల రాజకీయాలను దాటుకుని మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. డైవర్షన్ పాలిట్రిక్స్ చేయడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు తన క్రూరత్వాన్ని మరోమారు బయటకు తెచ్చారన్నారు. లడ్డూ వ్యవహారంపై చర్చించుకునేలా చేసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను దోచుకుంటున్నారని రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని మరిచి ప్రతిపక్ష పార్టీని బలహీనపడేలా చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జైసన్‌బాబు, రామసుబ్బులు, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, వేటపాలెం అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనీల్, కంపా అరుణ్, నాయకులు మామిడాల సుబ్బారావు, అద్దంకిరెడ్డి, దేవేంద్ర, గంగాధర్, వాసిమళ్ల వాసు శ్రీను, వెంకటేశ్వర్లు, శిఖా సురేష్ అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కారంచేడులో జేసీఎస్ కన్వీనర్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న నాయకులు

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉద్యోగులు, గ్రామస్తులు



మేదరమెట్లలో గుర్రంజాషువా జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



అద్దంకిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జాషువా సాహిత్య పీఠం సభ్యులు



పర్చూరులో గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న పాఠశాల యాజమాన్యం

- ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

చీరాల రూరల్: ప్రజలలో గూడుకట్టుకున్న మూఢాచారాలను తన కవితల ద్వారా చైతన్యం కలిగించి నవయుగ కవిచక్రవర్తిగా చరిత్రలో గుర్రం జాషువా లిఖింపబడ్డాడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని విజయనగర్‌కాలనీలో గుర్రం జాషువా 129వ జయంతి కార్యక్రమాన్ని ఉద్యోగులు, పెద్దలు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు దుడ్డు భాస్కరరావు, తేళ్ల సుబ్బారావు, తేళ్ల లక్ష్మీ ప్రసాద్, దుడ్డు వందనం మాట్లాడారు. ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ గుర్రం జాషువా పొందాడని చెప్పారు. ఆయన సమకాలీన కవిత్వ ఒరవడియైన భావకవిత్వ రీతి నుంచి పక్కకు జరిగి సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేసినట్లు చెప్పారు. ఆయన తక్కువ కులంలో జన్మించడంతో అనేక అవమానాలు ఎదుర్కొన్నప్పటికి ఆయన తన కవిత్వాన్ని ఆయుధాలుగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డాడని చెప్పారు. నేటి తరం కవులు, రచయితలు గుర్రం జాషువాను ఆదర్శగా తీసుకుని ఆయన అడుగు జాడలలో నడవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గొర్రెపాటి రవికుమార్, బుడంగుంట్ల లక్ష్మినరసయ్య, దుడ్డు ఏసుపాదం, చుండూరు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవి గుర్రం జాషువా..

పర్చూరు (చినగంజాం): నవయుగ కవి గుర్రం జాషువా అని..ఆధునిక తెలుగు కవులలో ఆయన కూడ ఒకరని పర్చూరు శాతవాహన హైస్కూల్ కరస్పాండెంట్ తేళ్ల వెంకట రాము అన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా శాతవాహన హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్‌మహల్, కాందిశీకుడు, స్వయవరం, కొత్తలోకం లాంటి అనేక రచనలను రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనురంజిని, హెచ్‌ఎం కే జాన్‌బోస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాషువా సాహిత్యపీఠం ఆధ్వర్యంలో..

అద్దంకి: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో శనివారం బుద్ధిస్ట్ రిటైర్డు బ్యాంకు మేనేజర్ తాళ్లూరు బాబురావు సౌజన్యంతో గుర్రజాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌యం కోట అంజమ్మ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు అందించారు. ఈకార్యక్రమంలో ఎం శ్రీదేవి, యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, చుండూరి మురళీ సుధాకరరావు పాల్గొన్నారు. గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని జాషువా సాహిత్యపీఠం అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహం వద్ద నిర్వహించారు.

మేదరమెట్ల: సమాజంలో కుల వివక్షత, అంటరానితనాన్ని పారదోలాలని మాట్లాడిన వ్యక్తి గుర్రం జాషువా అని వక్తలు పేర్కొన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో గుర్ర జాషువా జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష్యుడు మోంద్రు ఆంజనేయులు, కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి రఘురామ్, సీఐటీయూ నాయకులు రవీంద్ర, ప్రజాకళాకారుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గుర్రం జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలులు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్‌రావు భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి హేబేలు, ఐక్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ముండ్లమూరు మండల ఐక్యవేదిక బాధ్యుడు కంచర్ల అంజయ్య, అద్దంకి లైబ్రేరియన్ సుగుణరావు, మంచు హనుమంతరావు, ఎస్సీ ఎంప్లాయీస్ వేల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు



కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యులు

పర్చూరు (చినగంజాం): ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పర్చూరు వైద్యశాలలో కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలను వేసినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ తెలిపారు. మనుషులకు పిచ్చికుక్కలు కరిస్తే కరిచిన ప్రదేశాన్ని వెంటనే శుభ్రపరచాలని వివరించారు. అనంతరం సమీపంలో ఉన్న వైద్యశాలకు వెళ్లి ఉచిత వైద్యచికిత్స చేయించుకోవాలని కోరారు, 3,7,14,28 రోజుల్లో యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డీ మాధవి, పర్చూరు, కారంచేడు పశువైద్యశాలల వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని నిరసన

చీరాల రూరల్: నిత్యం వందలాది వాహనాలు, జనాలతో రద్దీగా ఉండే ప్రభుత్వాసుపత్రి రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నారు. శనివారం దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో గోరంట్ల ఆస్పత్రి ఎదురుగా గల రోడ్డు కుంగి ప్రమాదంగా మారిన ప్రదేశం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తమ స్వలాభాపేక్ష కోసం పనులు చేస్తున్నారేకానీ నాణ్యతగా పనులు చేయడంలేదని ఆయన ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే కొండయ్య కలుగజేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

వసతి గృహాల్లో వసతులు మెరుగుపరచాలి

అద్దంకి రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డీ. నాగ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం ప్రభుత్వ వసతి గృహాల తనిఖీల్లో భాగంగా స్థానిక కాకానిపాలెం జెడ్పీహెచ్‌ఎస్ వసతి గృహం, చైతన్య బధిరుల పాఠశాలలను సందర్శించారు. నీటి సౌకర్యం, గదుల్లో ఫ్యాన్లు, వంట గదులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్‌కె మహమ్మద్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు

అద్దంకి రూరల్: తనపై ఏడుగురు వ్యక్తులు బెదిరించి దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదు మేరకు ఏఎస్సై సైదయ్య కేసు నమోదు చేశారు. ఏఎస్సై వివరాల మేరకు.. మండలంలోని మైలవరం గ్రామానికి చెందిన మన్నేపల్లి వెంకటేశ్వర్లుపై 2020లో హత్యాయత్నం కేసు కోర్టులో నడుస్తోంది. ఈక్రమంలో ఈనెల 23 తేదీ గ్రామంలో పొలానికి వెళ్తున్న వెంకటేశ్వర్లును ఆ ఏడుగురు అడ్డుకుని బెదిరించి, దాడికి పాల్పడ్డారు. ఈమేరకు వారిపై ఏఎస్సై కేసు నమోదు చేశారు.

రాతి ముఖమండపానికి దాతల విరాళాలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖమండపానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన జమ్మలమడక వెంకట శ్రీనివాసనాగేంద్ర, మాధురి దంపతులు రూ. 3.33 లక్షలు, దర్శి మండలం, పాపిరెడ్డిపాలేనికి చెందిన వర్రా రమణరెడ్డి, అనూషలు రూ. 1.లక్ష విరాళాలు దేవస్థాన ఏసీ ఎం. తిమ్మానాయుడుకు అందజేశారు.

మున్సిపల్ అధికారులకు వీడ్కోలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల: చీరాల మున్సిపాలిటీ నుంచి బదిలీపై వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు వెళ్తున్న సందర్భంగా శనివారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల పురపాలక సంఘంలో వివిధ విభాగాల్లో అధికారులు అందించిన సేవలకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. అధికారులు సేవా దృక్పథంతో ప్రజలకు సేవలు అందించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు బొబ్బేపల్లి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మార్టూరు: జిల్లా స్థాయి ఆటలు పోటీలకు బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బీ చలపతి శనివారం తెలిపారు. ఇంకొల్లు మండలం గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పర్చూరు నియోజకవర్గస్థాయి పోటీల్లో వివిధ కేటగిరీలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వాలీబాల్, ఖోఖోలో అండర్–17 విభాగంలో ఇద్దరేసి చొప్పున, అదే ఆటలలో అండర్–14 విభాగంలో ఇద్దరేసి విద్యార్థులు చొప్పున మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ వీ వెంకట్రావును ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో చందలూరు విద్యార్థుల ప్రతిభ



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ ప్రతిమ

జే.పంగులూరు: అద్దంకి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీల్లో చందలూరు విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ కే ప్రతిమ తెలిపారు. అద్దంకి నియయోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ శనివారం సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీలలో పాల్గొన్న చందలూరు విద్యార్థులు అండర్–14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాలకు చెందిన కే సరిత ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–14 విభాగంలో యోగ పోటీలలో ఎస్ శృతి, ఎస్ భవ్యశ్రీ, కె సరిత, ఎం వెంకటేష్‌లు, అండర్–17 విభాగంలో ఏ లిఖిత, ఎస్ సుప్రియ, రత్నకుమారులు విజయం సాధించి జిల్లాస్థాయికి ఎంపికైయ్యారు. అండర్ –17 విభాగంలో వాలీబాల్ పోటీలో పాఠశాలకు చెందిన జి మణికంఠ, అండర్–14 విభాగంలో జి అఖిల్ వెంకటేష్, ఎస్ జోన, ఎస్ ఏప్రాలు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు.

